క్లుప్తంగా

మస్తానయ్యకు సత్కారం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం కార్యాలయంలో గురువారం సాయంత్రం ఇటీవల కళారత్న పురస్కారం స్వీకరించిన ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్యను కళావిపంచి, ఆరాధన ఆర్ట్స్ అకాడమీ, యువ కళావాహిని నిర్వాహకులు సత్కరించారు. మస్తానయ్య నిర్వహిస్తోన్న సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలను వారు అభినందించారు. కార్యక్రమంలో కళావిపంచి, ఆరాధన ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు తిరుమలేశ్వరరావు, ఉపాధ్యక్షులు సయ్యద్ జానీభాష, తిరుమలేశ్వరరావు, యువ కళావాహిని ప్రధాన కార్యదర్శి జి.మల్లికార్జునరావు, తెనాలి ఎంపీఓ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగిపై దాడి

బంగారం, నగదు తీసుకున్న వారిపై కేసు నమోదు

లక్ష్మీపురం: డబ్బులు ఇస్తానని చెప్పి పిలిపించి ఓ రిటైర్డ్ ఉద్యోగిని తీవ్రంగా కొట్టి బంగారం, రూ.4లక్షలు తీసుకుని బెదిరించిన ఘటనలో నిందితులపై నగరంపాలెం పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గంటసాల ఆనందరాజు అనే రిటైర్డ్ బ్యాంకు ఎంప్లాయి గుంటూరు కొత్తపేట ప్రాంతంలో నివాసం ఉంటాడు. ఇతనికి పది సంవత్సరాల క్రితం నగరంపాలెం మస్తాన్ దర్గా వెనుక భాగంలో హార్డ్‌వేర్ వ్యాపారం చేసే శ్రీనివాసరావుతో పరిచయం అయింది. ఆనందరాజు వద్ద శ్రీనివాసరావు 2024లో రూ.3లక్షలు అప్పుగా తీసుకుని రూ.1.50లక్షలు తిరిగి ఇచ్చేశాడు. మిగిలిన నగదు ఇస్తానని ఈనెల 26న తన హార్డ్ వేర్ షాపునకు పిలిపించిన శ్రీనివాసరావు అతని తనయుడు గోపి మరో ఇద్దరు కలిసి ఆనందరాజుపై భౌతికంగా దాడిచేశారు. బాధితుడి ఒంటిపై ఉన్న బంగారం, రూ.4లక్షలు బలవంతంగా ఫోన్ పే చేయించుకున్నారు. దీంతో ఆనందరాజు ఆసుపత్రిలో చికిత్స పొంది, గురువారం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు రోడ్డులో చెత్త తొలగింపు



పొన్నూరు: పొన్నూరు నుంచి గుంటూరు వెళ్లే ప్రధాన రహదారిలో రోజుల తరబడి పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించారు. చెత్త కారణంగా దుర్వాసన వస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను తెలియజేస్తూ 'స్వచ్ఛ సంకల్పానికి తూట్లు' శీర్షికన గురువారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. కథనంపై స్పందించిన మున్సిపల్ అధికారులు అదే రోజు యుద్ధ ప్రాతిపదికన ప్రొక్లెయిన్ ద్వారా చెత్తను తొలగించారు. సమస్యను పరిష్కరించడంతో వాహన చోదకులు హర్షం వ్యక్తం చేశారు.

సమాచారం లేకుండా థియేటర్ మూసివేత

ప్రత్తిపాడు: సమాచారం లేకుండా థియేటర్‌ను ఎందుకు మూసివేశారని తహసీల్దార్ జి.కరుణ కుమార్ థియేటర్ నిర్వాహకులను ప్రశ్నించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని ఓ థియేటర్‌ను గురువారం తనిఖీ చేసేందుకు తహసీల్దార్ వెళ్లారు. అప్పటికే థియేటర్ మూసి వేసి ఉండటంతో అక్కడ ఉన్న వారిని ఆరా తీశారు. గత కొద్ది రోజులుగా తీయడం లేదని వారు తెలిపారు. దీంతో లీజుకు తీసుకున్న నిర్వాహకులకు తహసీల్దార్ ఫోన్‌లో సంప్రదించారు. నెల రోజుల నుంచే థియేటర్ తియ్యడం లేదని వారు తెలియజేశారు. ఆ సమాచారాన్ని స్థానిక రెవెన్యూ అధికారులకు తెలియజేయాలంటూ తాహసీల్దార్ ప్రశ్నించారు. ప్రాథమిక సమాచారం అందిస్తే మేము పూర్తి వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని ఆయన అన్నారు. వెంట సిబ్బంది ఉన్నారు.

గొట్టిపాడులో డీఎల్‌డీఓ విచారణ

ప్రత్తిపాడు: మండలంలోని పెదగొట్టిపాడులో డివిజినల్ లెవల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీవో) పిచ్చిరెడ్డి విచారణ చేపట్టారు. గ్రామంలోని రాధాకృష్ణ గ్రామైఖ్య సంఘం యానిమేటర్ శ్రీకాంతను అక్రమంగా తొలగించడాన్ని నిరసిస్తూ అదే గ్రామానికి చెందిన కొందరు మహిళలు కొంత కాలంగా పోరాటం చేస్తున్నారు. అయినా వారి నుంచి ఎలాంటి సానుకూల స్పందన లేకపోవడంతో కొద్ది రోజుల కిందట జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ విచారణాధికారిగా డీఎల్‌డీవో పిచ్చిరెడ్డిని నియమించారు. ఈ నేపథ్యంలో గురువారం గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌డీవో విచారణ నిర్వహించారు. గ్రామైఖ్య సంఘంలోని మహిళల నుంచి విడివిడిగా లిఖిత పూర్వక స్టేట్‌మెంట్లను ఆయన తీసుకున్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు విచారణాధికారి పిచ్చిరెడ్డి తెలిపారు.

పూడికతీత పనులు వేగవంతం

- వర్షం నీరు రోడ్లపై నిల్వకుండా చర్యలు
- నగర కమిషనర్ పులి శ్రీనివాసులు
- పాతగుంటూరులోని పలు ప్రాంతాల్లో పర్యటన



డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వర్షం నీరు రోడ్ల మీద నిలవకుండా డ్రెయిన్లలోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా ప్రధాన డ్రెయిన్లలో పూడిక తీత పనులను వేగవంతం చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం కమిషనర్ బాలాజీ నగర్, పాత గుంటూరు తదితర ప్రాంతాల్లో పూడికతీత పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాలకు డ్రెయిన్లలో నీరు సక్రమంగా పారుదల ఉండేలా పూడిక తీత చేపట్టామని, డ్రెయిన్ల మీద ఆక్రమణదారులకు ఇప్పటికే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సమాచారం ఇచ్చామని, త్వరలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఆక్రమణలను తామే తొలగిస్తామన్నారు. డ్రెయిన్లలో తీసిన పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని, పనులకు ముందు, తర్వాత ఫొటోలతో పూడిక తీత వివరాలు ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అంతర్గత డ్రెయిన్లు మేజర్ డ్రెయిన్లలో కలిసే చోట తప్పనిసరిగా మెష్‌లు చేస్తున్నామని, వీటి వలన ప్లాస్టిక్ వ్యర్థాలను అడ్డుకోవచ్చన్నారు. ప్రాంతాల్లో నిలిచే వ్యర్థాలను ప్రజారోగ్య కార్మికులు ఎప్పటికప్పుడు తొలగించడం ద్వారా డ్రెయిన్ ఓవర్ ఫ్లో తగ్గించుకోవచ్చన్నారు. వర్షాల వలన నీరు నిలిచే ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటిని జెట్టింగ్ యంత్రాల ద్వారా బెయిల్ అవుట్ చేయడానికి ఇంజినీరింగ్ అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలు తమ ఇళ్లల్లోని వ్యర్థాలను డ్రెయిన్లలో వేయకుండా ఇంటి వద్దకు వచ్చే ప్రజారోగ్య కార్మికులకే అందించాలని కోరారు. ఈ పర్యటనలో ఏఈ పి.వెంకటేశ్వరరావు, టీపీఎస్ లక్ష్మణస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీఎంసీ కాల్ సెంటర్ ఏర్పాటు



కాల్ సెంటర్‌లో సిబ్బంది

నెహ్రూనగర్: రాబోయే మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సూచనల మేరకు నగరంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం తెలిపారు. ప్రజలు తమ ప్రాంతాల్లో వర్షాల వలన తలెత్తే సమస్యలు తెలపడానికి జీఎంసీ కాల్ సెంటర్ (08632345103) 24 గంటలూ పని చేసేలా ప్రత్యేకంగా సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. వర్షం వలన ప్రజలకు ఏ సమస్య తలెత్తకుండా అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు, చెట్లు విరిగి ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్నా, వర్షం నీరు నిలిచినా తక్షణం జీఎంసీ కాల్ సెంటర్ 0863-2345103 నంబర్లకు కాల్ చేస్తే సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. విరిగిన చెట్లను తొలగించడానికి ఉద్యానవన సిబ్బందిని అందుబాటులో ఉంచి, కాల్ సెంటర్ నుంచి వచ్చిన ఫిర్యాదులకు తక్షణం హాజరు కావాలన్నారు. విద్యుత్ సరఫరా అంతరాయం వలన తాగునీటి సరఫరాకి సమస్య లేకుండా ముందస్తుగా జనరేటర్లు ఏర్పాటు చేసుకోవడం, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఈఈలను ఆదేశించారు. మెయిన్ డ్రెయిన్‌లలో చిన్న డ్రెయిన్‌లు కలిసే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మెష్‌ల వద్ద వ్యర్థాలను ప్రజారోగ్య కార్మికుల ద్వారా ఎప్పటికప్పుడు తొలగించేలా పర్యవేక్షణ చేయాలని సిఎంఓహెచ్‌ని ఆదేశించారు. నగరంలో పలు ప్రాంతాల్లో హోర్డింగ్స్ విరిగి, బ్యానర్లు గాలికి ఎగురుతున్నాయని, ఆయా హోర్డింగ్‌లను తక్షణం తొలగించాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు.

ఆనందరావు సేవలు ఆదర్శనీయం



ఆనందరావు దంపతులను సత్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది

గుంటూరు మెడికల్: అంకితభావంతో విధులు నిర్వహించిన ఆనందరావు ఆదర్శనీయులని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి కొనియాడారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సమావేశ మందిరంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అధ్యక్షతన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఎంపీహెచ్‌ఈఓ, సీహెచ్‌ఓ అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బోయపాటి ఆనందరావు ఉద్యోగ విరమణ అభినందన సభ గురువారం జరిగింది. డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ 42 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న ఆనందరావు తనకు కేటాయించిన ఏ పని అయినా సమర్థవంతంగా నిర్వహిస్తారన్నారు. ఆయన సేవలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆనందరావు దంపతులకు మెమొంటు అందజేసి ఘనంగా సత్కరించారు. ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డాక్టర్ ఇ.అన్నపూర్ణ, డాక్టర్ బీఎస్ఎస్ రోహిణి రత్నశ్రీ,, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, స్టేట్ ఎంపీహెచ్‌ఓ, సీహెచ్‌ఓ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.శేషగిరి రాజు, డెమో ఎ.జయప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు అమలు చేసేవరకు పోరాటం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్




సమావేశంలో మాట్లాడుతున్న జంగాల

లక్ష్మీపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలపై పోరాడుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం గుంటూరు నగరంలోని సీపీఐ జిల్లా కేంద్ర కార్యాలయంలో పొన్నూరు నియోజకవర్గ కమిటీ సమావేశం సీనియర్ నాయకుడు కొల్లి రంగారెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జంగాల మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన తరువాత ప్రజా, రైతు, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక నిరంకుశ విధానాలు అధికమయ్యాయని మండిపడ్డారు. నిత్యవసర సరుకుల ధరల పెంచి నిరంకుశ విధానాన్ని అవలంబిస్తున్నారని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యవసర సరుకుల ధరలు పెంచి ప్రజల నడ్డి వీరుస్తున్నారన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజాధనాన్ని దోచుకొని అదానికీ అప్పజెప్పడానికి స్మార్ట్ మీటర్లు బిగించే కార్యక్రమం మొదలుపెట్టారని ఆరోపించారు. ప్రజల సొమ్ము పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతూ వారి సంపదను పెంచుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉచిత గ్యాస్, ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూన్ 2న అన్ని మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నియోజకవర్గ నాయకులు ఆరేటి రామారావు, రెంటాల కుమారి, షేక్ గౌస్, కూసం నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

లక్ష్మీపురం: సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూన్ 2న మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ధర్నా వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గుంటూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పేదలు అందరూ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నగర కమిటీ సభ్యులు ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు, మంగ శ్రీనివాసు, చల్ల మరియదాసు పాల్గొన్నారు.

లాభాల ఆశ చూపి రూ.8.01 లక్షల టోకరా



రూ.32,500 నగదు పంపినట్లు వివరాలు

మంగళగిరి టౌన్: సైబర్ నేరాలపై అవగాహన లేక అమాయకులు బలైపోతున్నారు. తాజాగా ఓ వ్యక్తిని మోసగించి రూ.8.01 లక్షలు కాజేశారు. స్టాక్ ట్రేడింగ్ చేస్తే తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వచ్చేలా చేస్తామని సైబర్ నేరగాళ్లు మంగళగిరి నగరానికి చెందిన ఓ వ్యక్తిని నమ్మబలికారు. మంగళగిరి పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. నగర పరిధిలోని రాజీవ్ సెంటర్‌కు చెందిన వెనిగళ్ల మధు నరేష్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంజనీరింగ్ పూర్తి చేసి ఓ ప్రైవేటు కంపెనీలో సీనియర్ కన్సల్టెంట్‌గా బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నారు. కరోనా తరువాత మంగళగిరి నుంచి వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నారు. ఇటీవల తన వాట్సాప్ నెంబర్‌కు ట్రేడింగ్ ద్వారా అధిక డబ్బులు సంపాదించుకోండి అంటూ ఒక మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్‌కు ఆకర్షితుడైన నరేష్ ఎలా అంటూ రిప్లయ్ ఇచ్చారు. వెంటనే ఒక టెలిగ్రామ్ లింక్‌ను వాట్సాప్‌కు పంపారు. ఆ లింక్‌లో రిజిష్టర్ అవ్వమని చెప్పారు. తెలుగులో ఒక గ్రూప్ యాడ్ చేసి వివిధ టాస్కుల ద్వారా డబ్బులు సంపాదించవచ్చు అని నమ్మబలికారు. ముందుగా మీరు కొంత మనీ పే చేయాలని ఆ గ్రూప్‌లో తెలిపారు. మే 23వ తేదీన మొదటగా వారు ఇచ్చిన యూపీఐ ఐడీకి రూ.5 వేలు పంపించారు. దానికి ప్రాఫిట్‌గా రూ.7,500 చూపించారు. అదే రోజు కొత్త టాస్క్ అని చెప్పి రూ.32,500 ట్రాన్స్‌ఫర్ చేస్తే రూ.59 వేలు ప్రాఫిట్ చూపించారు. ఇలా.. టాస్క్‌ల ద్వారా రూ.8.01 లక్షలు సైబర్ నేరగాళ్లు సరేష్‌కు వల వేశారు. చివరిగా మోసపోయానని గ్రహించి సైబర్ క్రైమ్‌లో నరేష్ ఫిర్యాదు చేశారు. ఘటనపై మంగళగిరి పోలీస్ స్టేషన్‌లో నీరజ్ అనే టెలిగ్రామ్ యూజర్‌పై తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఉద్యోగుల సమష్టి కృషితోనే వర్సిటీ ప్రగతి



ఏఎన్‌యూ: ఉద్యోగుల సమష్టి కృషితోనే వర్సిటీ ప్రగతి పథంలో ఉంటుందని ఏఎన్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి ఎ.శివప్రసాదరావు అన్నారు. 1982లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టి నాలుగున్నర దశాబ్దాలకు పైగా సేవలను అందించిన ఆర్.రామారావు ఉద్యోగ విరమణ చేశారు. ఈసందర్భంగా పరీక్షా భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో రామారావు దంపతులను పరీక్షా భవన్ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పరీక్షల నోడల్ ఆఫీసర్ రెడ్డి ప్రకాశరావు, కావూరి శ్రీనివాసరావు, ఎన్.తాతారావు, జగదీశ్వరరావు, కె.కోటేశ్వరరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

టిడ్కో నివాసాల్లో మౌలిక వసతులు కల్పించాలి



గుంటూరు రూరల్: టిడ్కో గృహ సముదాయాల వద్ద మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ అడవితక్కెళ్లపాడులోని టిడ్కో గృహ సముదాయాలను జీఎంసీ, టిడ్కో ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. మౌలిక వసతులపై ప్రజలు తెలిపిన సమస్యలను తెలుసుకొని, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సదరు ప్రాంతంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. తక్షణం తాగునీటి సమస్య తీరేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌ఈని ఆదేశించారు. పారిశుద్ధ్య సమస్యలపై ప్రజల నుంచి అధికంగా ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పర్యటనలో ఎస్‌ఈ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన



గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని గురవారం నిర్వహించారు. లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందస్తు ఖరీఫ్ ప్రణాళికలలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, భూసార పరీక్షలు, నూతన వంగడాల ఎంపికపై రైతులకు అవగాహన కల్పించారు. వివిధ పంటలలో సస్యరక్షణ చర్యలు, పశు పోషణలో మెళకువలను రైతులకు శాస్త్రవేత్తలతో అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేశారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.శోభమణి, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వేంకటేశ్వర్లు, కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ యం.యుగంధర్‌కుమార్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గంగాదేవి, డీపీఎం రాజకుమారి, మండల వ్యవసాయ అధికారి ఐ.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి



విన్సెంట్‌ను అభినందిస్తున్న నూరిఫాతిమా

పట్నంబజారు: క్రీడల్లో ప్రతిభ చాటిన ప్రతి ఒక్కరికీ అండగా ఉండాల్సిన బాధ్యత అందరిపై ఉందని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆమె కార్యాలయంలో గురువారం ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ కాకినాడ (ఏఎంఏ) నిర్వహించిన అండర్-16 టెన్నిస్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన కొరిటెపాటి విన్సెంట్‌ను దుశ్శాలువతో సత్కరించారు. ఈసందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ అతి చిన్న వయస్సులోనే అసాధారణ ప్రతిభ కనబర్చిన విన్సెంట్ అభినందనీయుడన్నారు. గుంటూరు నగరానికి చెందిన చిన్నారి దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. యువ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్‌ది ముమ్మాటికీ హత్యే



పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్

పాస్టర్ పగడాల సంస్మరణ సభలో మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం దళిత, క్రిస్టియన్, మైనార్టీలను టార్గెట్ చేస్తూ దాడులు చేయిస్తుందని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ విమర్శించారు. గుంటూరు నగరంలోని లాడ్జిసెంటర్‌లో ఉన్న ఎల్ఈఎం స్కూల్ ఆవరణలో క్రైస్తవ సేవా సంఘం జేఏసీ ఆధ్వర్యంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభ నిర్వహించారు. హర్షకుమార్ మాట్లాడుతూ క్రిస్టియన్, మైనార్టీలను ఇబ్బంది పెట్టే విధంగా వారిపై హిందూ చట్టాలను రుద్దుతున్న క్రమంలో పాస్టర్ ప్రవీణ పగడాల వాటికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిల్ వేశాడన్నారు. వాటికి సమాధానం చెప్పలేని పరిస్థితి వస్తుందనే భయంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయన హత్యకు పూనుకున్నా యన్నారు. మార్చి 24న రాజమండ్రిలో చనిపోతే 25వ తేదీన ఆయన బ్యాంక్ అకౌంట్స్ సీజ్ చేశారని, ల్యాప్‌టాప్, ఐపాడ్ మాయం చేశా రన్నారు. ఆయనది ప్రమాదమే అనుకుంటే వీటిని మాయం చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. పోస్టుమార్టం రిపోర్టులో మద్యం తాగలేదన్నారు. ఫైనల్ రిపోర్టులో మద్యం తాగిన అనవాళ్లు ఉన్నాయన్నారు. హెల్మెట్ ఉన్నప్పటికీ హెల్మెట్‌కి ఏం కాలేదు..కానీ తల పగిలిందని అన్నారు. వీటిన్నంటిపై మాట్లాడితే ప్రభుత్వం నోరు నొక్కే ప్రయత్నం చేసిందని, మొన్న వక్ఫ్ బిల్లు పెట్టి ముస్లింలను దెబ్బకొట్టాలని చూశారని తెలిపారు. రేపు క్రైస్తవ ఆస్తులను దోచేందుకు మరో బిల్లు పెడతారని, వీటిన్నింటిని అడ్డుకునేందుకు మనందరం కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

పశువుల కన్నా హీనంగా కొట్టారు

తెనాలి ఐతానగర్‌లో ముగ్గురు యువకుల్ని పోలీసులు పశువులను కొట్టినట్లుగా కొట్టారని అన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఐతానగర్ సెంటర్‌లో స్థానికులు ఏర్పాటుచేసే క్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నాదెండ్ల మనోహర్ విగ్రహం ఏర్పాటు చేయనియకుండా అడ్డుకున్నారని తెలిపారు. కానీ ఐతానగర్ వాసులంతా పట్టుబట్టి విగ్రహం ఏర్పాటు చేసినందుకే కక్షపెట్టుకుని యువకులను కొట్టించారని విమర్శించారు. డీజీపీ, ఐజీ, ఎస్పీలు ముందుగా కానిస్టేబుల్ చిరంజీవి ఫోన్ పే అకౌంట్ చెక్ చేయాలన్నారు.

దుష్ప్రచారం చూసి బాధపడ్డా...

పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై దుష్ప్రచారం చూసి చాలా బాధపడ్డానని అంబేడ్కర్ ఇండియన్ మిషన్ వ్యవస్థాపకులు పీవీ సునీల్‌కుమార్ అన్నారు. పగడాల ఏ ఆశయం కోసం పోరాడాడో మనం అంతా గ్రహించాలన్నారు. ముఖ్యంగా దళిత వాడలన్నీ కూడా పంచాయతీలు కావాలని అన్నారు. ప్రతి పంచాయతీకి సంవత్సరానికి రూ.2కోట్లు నిధులు కేటాయించినప్పుడే మనకి బలం చేకూరుతుందన్నారు. మనమంతా ఐక్యంగా తమ హక్కుల కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ ముఖ్య నాయకులు మల్లెల రాజు, వడ్డె నవీన్, కాకుమాను రాజశిఖమణి, లంకా కరుణాకర్, డాక్టర్ గాలి వినోద్‌కుమార్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

జొమాటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలియజేస్తున్న జొమాటో కార్మికులు

లక్ష్మీపురం: జొమాటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మికులపై పెట్టిన తప్పుడు పోలీసు ఫిర్యాదులను వెనక్కి తీసుకోవాలని గిగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకుడు సోగా బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. గురువారం జరిగిన నిరసన కార్యక్రమంలో బ్రహ్మయ్య మాట్లాడుతూ బ్లాక్ చేసిన జొమాటో ఐడీలను తిరిగి పునరుద్ధరించాలన్నారు. కార్మికులకు పీక్ అవర్స్‌లో పే అవుట్ రూ.15 ఇవ్వాలని, నాన్ పీక్ అవర్స్‌లో రూ.10 ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే జొమాటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు పూనుకుంటారని హెచ్చరించారు. గిగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి.ముత్యాలరావు మాట్లాడుతూ జొమాటో కార్మికుల సమస్యలు పరిష్కరించకపోగా తప్పుడు ఫిర్యాదులు చేయడం బాధాకరన్నారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు, గుంటూరు నగర (తూర్పు కమిటీ) ప్రధాన కార్యదర్శి కట్లగుంట శ్రీనివాసరావు, జొమాటో కార్మికులు రణధీర్, శశికుమార్, వెంకట్, నరసింహారావు, వాల్మీకి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ఆయుధాల శిక్షణ



శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ క్యాడెట్స్

గుంటూరు రూరల్: సమాజానికి సేవ చేసే శక్తివంతమైన యువతను సన్నద్ధం చేసేందుకు ఎన్‌సీసీ ప్రత్యేక శిక్షణ శిబిరం దోహద పడుతుందని లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్ తెలిపారు. చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా 10 ఆంధ్ర బాలికల బెటాలియన్ ఆధ్వర్యంలో కంబైన్డ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంప్-1 శిక్షణ తరగతులు గురువారం కొనసాగాయి. కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్‌లకు ఆయుధాల వినియోగంపై ప్రత్యేక శిక్షణను అందించారు. ఈ శిక్షణలో విద్యార్థులు భద్రతా నియమావళి, ఆయుధాల ఉపయోగ విధానాలు, లక్ష్య సాధన నైపుణ్యం, ఆధునిక కాలంలో ఆయుధాల ప్రాధాన్యత అంశాలను వివరించారు. లీగల్ అడ్వైజర్ అనురాధ మాట్లాడుతూ.. ఈ శిక్షణ తరగతుల ద్వారా విద్యార్థులకు దేశ భద్రత, చట్టబద్ధత, సామాజిక బాధ్యత, తదితర అంశాలపై అవగాహనను పెంపొందించుకుంటారని తెలిపారు. శిక్షణ ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుదలతో పాటు దేశభక్తి గుణం మరింత బలోపేతమవుతుందని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్‌లు తెలిపారు. ఈ తరహా శిక్షణలు విద్యార్థుల్లో భద్రతపరమైన అవగాహనను పెంచుతాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్‌లు అన్నారు. శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, అభినందించారు. డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ మేజర్ అవినాశిపటేల్, క్యాంపు సీనియర్ జె.సి.ఒ ఇమాంసాహెబ్ షేక్, క్యాంపు ట్రెయినింగ్ జె.సి.ఒ రాజు, క్యాంపు సూపరింటెండెంట్ రాజశేఖరబాబు పాల్గొన్నారు.